● **పోరుమామిళ్ల :** వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు వీరయ్య, నాయకులు సత్యమయ్య, బాలుడు తెలిపారు. వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

● **చాపాడు :** సోమాపురం, పల్లవోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన వై.వెంకటమ్మ, డి.కొండమ్మను సోమవారం అంగన్‌వాడీ అధికారులు సన్మానించారు. సీడీపీఓ సావిత్రమ్మ, ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

● **గోపవరం :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, నోడల్ అధికారి విక్టర్‌మనోహర్, ఎంపీడీఓ హరినారాయణ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ చిన్నయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్య కృషీవలుడు విశ్వనాథుడు

కాశినాయన : సామాన్య మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన నల్లేరు విశ్వనాథరెడ్డి వ్యవసాయంపై ఎక్కువ మక్కువ చూపేవారు. ఉద్యానవన పంటలపై దృష్టి సారించి అధిక దిగుబడి సాధించి ఉత్తమ రైతుగా పేరుపొందారు. ఈ నేపథ్యంలోనే రాజకీయంలో కూడా.. తన బంధువులు రాజకీయాలు, వ్యాపారాల్లో ఉన్నా తనకంటూ స్వయంగా మధ్యతరగతి నుంచి ఎదిగిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. పలు సీడ్ కంపెనీలలో ఆర్గనైజర్‌గా పని చేస్తూ కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాల్లో పది వేల ఎకరాల్లో సీడ్ సజ్జలు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటల విత్తనాలను రైతులకు ఇచ్చి గిట్టుబాటు ధర కల్పిస్తూ వస్తున్నారు. దీంతో రైతులు కూడా ఆయా పంటలపై ఎక్కువ ఆదాయం గడిస్తున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో నల్లేరు విశ్వనాథరెడ్డి (ఫైల్)

2001లో రాజకీయ అరంగేట్రం చేశారు. నాటి నుంచి నేటి వరకు మండలంలో ఓటమి లేని నాయకుడిగా తన రాజకీయ చతురతను ప్రదర్శిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మండల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పలు అభివృద్ధి పనులను చేపట్టారు. కొత్తగా మండలం ఏర్పడటం, రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో తారురోడ్లు, సీసీ రోడ్లతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మండల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ప్రతినిత్యం ప్రజలకు, నాయకులకు అందుబాటులో ఉంటూ ప్రజా అవసరాలను తీరుస్తూ వస్తున్నారు.

సజావుగా పదో తరగతి పరీక్షలు



ప్రొద్దుటూరులో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సవ్యంగా జరిగాయి. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో 69 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు తెలుగు, ఉర్దూ, సంస్కృతం పరీక్ష రాశారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందే చేరుకుని తమ గదులను తెలుసుకున్నారు. విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు ముందే పరీక్ష గదిలోకి విద్యార్థులను అనుమతించారు. ప్రొద్దుటూరు డివిజన్ పరిధి 17 మండలాల్లోని 69 పరీక్షా కేంద్రాల్లో 12,794 మందికి గాను 12,695 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 99 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రొద్దుటూరు మండలంలో 19 పరీక్షా కేంద్రాల్లో 3664 మందికి గాను 3645 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, 19 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ సావిత్రమ్మ తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం వచ్చిన కుటుంబ సభ్యులతో సందడి నెలకొంది.

రాజుపాళెం : రాజుపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ సెంటర్‌లో 180 మందికి 179, బీ సెంటర్‌లో 145కు 144 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలు లేకుండా, ఎవరూ రాకుండా ఎస్‌ఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఎం.పద్మలత సెంటర్లను తనిఖీ చేశారు.

బద్వేలు అర్బన్ : పట్టణంలో మొత్తం 1767 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 19 మంది గైర్హాజరు కావడంతో 1748 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది ఆయా పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రతి కేంద్రంలో బెంచీలు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షాల కేంద్రాల వద్ద పరీక్ష నిర్వహణ సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. తొలిరోజు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి కనిపించింది. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు.

పోరుమామిళ్ల: మండలంలో పరీక్షకు 983 మంది హాజరు కావాల్సి ఉండగా 977 మంది హాజరైనట్లు ఎంఈఓ రఘురామిరెడ్డి తెలిపారు. పట్టణంలో 6 సెంటర్లలో పరీక్షలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

కలసపాడు : కలసపాడులో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 164 మంది విద్యార్థులకు గాను 163 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 187 మంది విద్యార్థులకు గాను 185 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రధానోపాధ్యాయినులు పి.జె.పి.కవిత, మెర్సీమాలిని తెలిపారు.

మైదుకూరు : పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లు, గురుకుల, కస్తూర్బా పాఠశాలలకు చెందిన 1203 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, వారి కోసం మైదుకూరులో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు 63 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మొదటి రోజు ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

చాపాడు : మండలంలోని చాపాడు, లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 359 మంది విద్యార్థులకు గాను పూర్తి స్థాయిలో హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి రవిశంకర్ తెలిపారు. చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు, లక్ష్మీపేట ఉన్నత పాఠశాలలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

బాలింతలపై అప్రమత్తంగా ఉండాలి

గోపవరం : గర్భిణులు, బాలింతల పట్ల అప్రమత్తంగా ఉండాలని నోడల్ అధికారి డాక్టర్ వి.విక్టర్‌మనోహర్, మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ వెంకటరత్నాలు అధ్యక్షతన జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు అవసరమైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గౌస్, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై మండల వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఏ.ఉదయకిరణ్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నోడల్ అధికారి నాగన్న, వైద్యాధికారులు మాట్లాడుతూ రక్తహీనత కలిగిన గర్భిణులు, పిల్లలను గుర్తించడం, హైరిస్క్ గర్భిణుల కోసం సుఖప్రసవానికి ఏర్పాట్లు చేయడం, టి.బి., కుష్ఠువ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందించడం వంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాన్ని వైద్య సిబ్బంది పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, ఎంఈఓ మురళీదేవి, జెడ్పీటీసీ దావీదు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, వైద్య సిబ్బంది నాగమణి, విజయలక్ష్మి, రాజమ్మ, రామతీర్థం, సచివాలయ ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

చాపాడు : గర్భిణులు, బాలింతలు తమ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషహాకారాన్ని తీసుకోవాలని ఎంపీపీ తెలిదెల లక్షుమయ్య తెలిపారు. మంగళవారం పల్లవోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్న పిల్లలు ప్రభుత్వం ఇచ్చే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


జన్మదిన శుభాకాంక్షలు
బద్వేలు నియోజకవర్గం మరియు పరిసర ప్రాంతాలలో గత మూడు దశాబ్దాలుగా
వ్యవసాయాభివృద్ధికి, హైబ్రిడ్ విత్తనోత్పత్తికి నిరంతరం కృషిచేస్తూ...
వందలాది గ్రామాల్లోని వేలాది మంది యువకులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తూ...
రైతు బాంధవుడిగా పేరొంది అలాగే గత రెండు దశాబ్దాలుగా
ఇటు రాజకీయ రంగంలో సైతం ఓటమీ ఎరుగని నాయకునిగా, ప్రజానేతగా
యుగ నాయకునిగా మంచి మనిషిగా పేరొందిన మా ప్రియతమ నాయకులు
ఆత్మీయ బంధువు మృధుభాషీ, స్నేహశీలి అయిన
శ్రీ నల్లేరు విశ్వనాధరెడ్డి అన్న గారికి హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు...
J. రమణారెడ్డి
S. శ్రీనివాసులరెడ్డి
B. శ్రీనివాసులు
K. ఉదయ్ భాస్కర్
T. బాలగురివిరెడ్డి
P. రామలక్ష్మిరెడ్డి
U. శ్రీనివాసులరెడ్డి
K. నారాయణరెడ్డి
SK. మౌలాలి
P.V. రమణారెడ్డి
T. రవీంద్రారెడ్డి
P. జగన్‌మోహన్‌రెడ్డి
P. మాబు
K. వెంకటసుబ్బయ్య
G. ప్రసాద్
P. అమర్
శ్రీ నల్లేరు విశ్వనాధరెడ్డి గారు
Ex. MPP
YSRCP మండల అధ్యక్షులు
SA కాశినాయన (మం) బద్వేలు నియోజకవర్గం